

# గాడ్డా ? గాడిద గుడ్డా!

డా|| సుదర్శన్ రాజ్

[ఎడ్మాన్‌టన్, కెనడా]

"ఒకసార్రి వరంథామయ్యగార్ని చూసి రా రా జగన్నాథం. పాపం పెద్దాయన. ఉన్న ఒక్క కొడుకూ దూరంలో ఉన్నాడు" పురమాయించింది తల్లి లక్ష్మీకాంతమ్మ.

"నరేనమ్మా సాయంత్రం వెళ్తాలే" అన్నాడు 'జానీ'.

వరంథామయ్య గారి పుత్రుడు రామ్మూర్తి, జగన్నాథం చిన్నప్పుడు కలిసి చదువుకున్నారు. అదే స్నేహం. రామ్మూర్తి 'మైనింగ్ ఇంజనీర్' భిలాయిలో పనిచేస్తున్నాడు.

జగన్నాథం ఎం ఎస్ సి పూర్తి చేసి తర్వాత అమెరికా వెళ్లి 'ఏస్ట్రోఫిజిక్స్'లో డాక్టరేటు, కంప్యూటర్ సైన్సులో ఎం ఎస్ పట్టాలు తీసుకున్నాడు. పట్టాలతో బాటు కొంచెం తల బిరుసు కూడా ఎక్కువైంది.

'నాసా'లో ఉద్యోగం రాగానే రెండు కళ్లూ నుదిటి మీదకి వెళ్లాయి. దానితో బాటు రెండు చిన్న కొమ్ములు కూడా తలమీద మొలిచాయి తనంతటి తెలివైన వారెవరూ లేనట్టు, భారతీయ వ్యక్తి అంటే ఏమీ పనికి రాని వాడనే ఉద్దేశ్యంతోనూ మెలుగుతాడు. తోటి భారతీయులు పురుగులతో నమానం. భారతీయ నంప్రదాయమంటే నుతరామూ పడదు. తల్లి తండ్రులింకా బ్రతికున్నారు. కాబట్టి ఏ అయిదారేళ్లకో భారత దేశం వచ్చి పోతూంటాడు.

వరంథామయ్యగారు గణిత శాస్త్రంలో లెక్చరర్ చేసి, రిటైరు అయి దాదాపు పది నంవత్సరాలవుతోంది. గుంటూరు బ్రాడీపేటలో స్వగృహంలోనే బస.

జగన్నాథాన్ని చూస్తూనే ఆప్యాయంగా ఆహ్వానించి కుశల ప్రశ్నలు వేయడం ప్రారంభించేడు వరంథామయ్య.

"ఎన్నాళ్లు శలవు? ఒక్కడివే వచ్చావా! అమ్మాయి కూడా వచ్చిందా?"

"ఆరువారాలు శలవు. 'జాకీ' కూడా వచ్చిందండి."

"'జాకీ' ఎవరు?" - అమెరికాలో మరో దొరసానిని పెళ్లి చేసుకున్నాడా అన్న ధోరణిలో.

"అదే, జానకి. అక్కడ అందరూ నన్ను 'జానీ' అని, జానకిని 'జాకీ' అని పిలుస్తారు."

"మరి మేము కూడా అలాగే పిలవాలా?" వరంథామయ్య నందేహం వెలిబుచ్చేడు.

"అలా పిలుస్తేనే బాగుంటుంది. లేక పోతే ఏదో కొత్తగా ఉంటుందండీ" - తన అమెరికన్ నాగరకతకి భంగమొస్తుందన్నట్లుగా.

"అమెరికాలో ఎక్కడుంటున్నావు?"

"ఫ్లారిడా స్టేట్‌లో 'బర్లాండో' నమీపంలో ఉంటున్నానండి."

"ఎక్కడ పనిచేస్తున్నావు జానీ?"

"నాసా'లో 'కంప్యూటర్ స్పెషలిస్టు'గా పని చేస్తున్నాను."

"ఏమిటి 'నన' అంటున్నారు. నన్నే ఆడిపోనుకుంటున్నారా?" అంటూ వచ్చింది పర్వతవర్ధని. పేరుకి తగ్గట్టుగానే కొంచెం బొద్దుగా, ఎత్తుగా ఉంటుంది. జగన్నాథాన్ని చూసి 'ఎప్పుడొచ్చావు బాబూ" అంటూ కుశల ప్రశ్నలు వేసింది.

"ఇక నాకేం పనిలేదుటే నిన్ను ఆడిపోనుకోడం తప్ప! 'జానీ' 'నాసా'లో పనిచేస్తున్నాట. అంతరిక్షంలోకి రాకెట్లు, 'స్పేస్ షిప్'లు పంపించే నంస్థలో - " వివరించాడు భార్యకి.

"మరి 'జానీ' ఏమిటి? జగన్నాథం కాదూ?" 'క్లూ' ఏమీ దొరకనట్లు నందిగ్ధం వెళ్లబుచ్చింది పర్వత వర్ధని.

"అమెరికాలో అందరూ అలాగే పిలుస్తారుట." భార్య నందేహం తీర్చేడు వరంధామయ్య.

"మీకు జబ్బు చేయకపూర్వం 'జానీ వాకర్' కదూచుక్కేనుకునే వారు." - 'జానీ వాకర్'లో 'జానీ' జ్ఞావక మొచ్చింది పర్వత వర్ధనికి.

"అది వేరులేవే" - నా బండారమంతా ఎందుకు బయట పెడ్తావు అన్నట్లు.

"ఎంతో పురోగమించిన అమెరికా వాళ్లకి ఆ మాత్రం నోరు తిరగదా!" అని నణుక్కుంటూ వంటింట్లోకి వెళ్లింది.

జానీ గొంతు నవరించుకుంటూ "అంతా బాగున్నారా! రాము ఎక్కడున్నాడు?" - ప్రశ్నించేడు.

"దేవుడి దయ వల్ల అంతా బాగానే ఉన్నాం. 'జానీ'. రాము భిలాయిలో పనిచేస్తున్నాడు. 'బైగాడ్స్ గ్రేస్' వాడికీ మధ్యనే ప్రమోషన్ కూడా వచ్చింది."

"వరంథామయ్య గారూ! ప్రతీ వాడూ దేవుడిదయ, 'గాడ్స్ గ్రేస్' అంటూంటారు. రైల్లో ప్రయాణం చేస్తున్నప్పుడు ఒక వ్యక్తిని కలిసేను. మాటల్లో తనది పెద్ద కుటుంబమని, గుమాస్తాకి వచ్చే తన జీతంలో జీవితం గడపుతున్నానని చెప్పాడు. ఈ 'ఎల్ డి సి'కి వచ్చే ఏ నాలుగైదు వందల రూపాయల జీతంలో ఆరుగురు పిల్లలున్న నంసారానికి ఏమిటి నరిపోతుదండీ! మల మల మాడిపోతూ ఉంటారు. 'గాడ్స్ గ్రేస్' గాడ్డా! గాడిద గుడ్డా అనుకున్నాను" - జానీ లెక్చరు పూర్తి చేశాడు.

ఆ మాట వినగానే భగవంతుడే నర్వమనుకున్న వరంథామయ్యకి వళ్లు మండింది. జానీకి కొంచెం బుద్ధి నరిచెయ్యాలనుకున్నాడు లెఖ్ఖల మేష్టారు.

"జానీ! నా కెన్నాళ్ల నుంచో కొన్ని నందేహాలున్నాయి. ఎవరినడిగినా నరిగా వినిపించుకోరు. నువ్వు 'ఫారిన్ రిటర్న్‌డ్ కదా, నీవు తీర్చగలవేమో! అడగమంటావా!"

"ఓ! నిరభ్యంతరంగా అడగండి" - [ఈయన వేసే ప్రశ్నలకి ఆ మాత్రం జవాబు చెప్పలేమా అన్న ధీమాతో]

'దొరికాడురా దొంగ' అనుకున్నాడు మనసులో వరంథామయ్య.

"విద్యుచ్ఛక్తిని చూడగలమా?" - వరంథామయ్యగారి ప్రథమ ప్రశ్న.

"ఎందుకు చూడలేమూ?" - జానీ వేసిన తిరుగు ప్రశ్న.

"ఎలాగ చూడగలము?"

"బల్బులు, బ్లెండర్లు, ఎలక్ట్రిక్ ట్రెయిన్‌లు - ఇవన్నీ విద్యుచ్ఛక్తి కాదా!"

"అవి విద్యుచ్ఛక్తి వల్ల కలిగే అంతిమ ఫలితాలు కాని, విద్యుచ్ఛక్తి కాదు కదా!" - వరంథామయ్య స్వరంలో విమర్శన.

"కొబ్బరి కాయ చెట్టు నుంచి తెగినప్పుడు పైకి ఎగర కుండా భూమి మీదికే ఎందుకు పడుతుంది?"

"భూ మ్యాకర్షణ వల్ల" - ఈ మాత్రం ఇంగిత జ్ఞానం లేని ఈ వరంథామయ్య కాలేజీ లెక్చరర్ ఎలాగ వెలగబెట్టాడురా అనుకుంటూ జానీ.

"మరి ఆ భూమ్యాకర్షణ శక్తిని చూడగలమా?"

"ఆ"...గొంతు సరిచేసుకుంటూ - చూడలేము."

"మరైతే భూమ్యాకర్షణ శక్తి ఉందని ఎలా తెలుసు?"

"న్యూటన్ మహాశయుడు చెట్టు మీద నుంచి 'ఏపిల్ పండు' నేల మీద పడినప్పుడు భూమ్యాకర్షణ శక్తిని 17వ శతాబ్దంలో కనిపెట్టాడు గదండీ?" తను భౌతిక శాస్త్రంలో పండితుడన్న పోజులో జానీ.

"న్యూటన్ కనిపెట్టక ముందు భూమ్యాకర్షణ శక్తి లేదంటావా?"

"ఉంది, కానీ న్యూటన్ కనిపెట్టిందాకా మనకి తెలీదుగా!"

అయస్కాంత శక్తిని చూడగలవా?" రాను రాను జానిని ఇరకాటంలో పెడుతున్నాడు వరంథామయ్య.

"ఓ యస్" సరిగా ఆలోచించకుండా మళ్లీ పప్పులో అడుగేశాడు జానీ.

"ఎలాగ?"

చిన్న పిల్లాడిలా సమాధానం చెప్తున్నాడు జానీ.

"ఇనుప రజను కాని, మేకులు కాని కొంచెం దూరంలో ఉంచి అయస్కాంతాన్ని కొంచెం దూరంలో ఉంచితే ఆ ఇనుప రజను, మేకులు పరుగెత్తుకుంటూ వచ్చి అయస్కాంతానికి అతుక్కుంటాయిగా" ఈ ముసలాయన ఓడిపోయేడులే అన్న ధోరణిలో.

"అది కూడా అయస్కాంత శక్తి వల్ల కలిగే ఫలితమే కాని అసలు అయస్కాంత శక్తి కాదు కదా మనం చూస్తున్నది!"

"సరే! అలాగేనండి" - జానీ సంధికుదుర్చుకున్నాడు.

వరంథామయ్య బుఱ్ఱ గోక్కుంటూ - "ఇంకొక ప్రశ్న" అన్నాడు.

"ఆలోచనలు ఎలా వస్తాయి?"

"మెదడులోంచి వస్తాయి" - జానీ సూటి సమాధానం.

"మెదడు రేగడిమట్టి ముద్ద లాగ కనిపిస్తుంది కదా?"

"మెదడు ముఖ్యంగా రెండు పక్షాలుగా ఉంటుంది. ఎడమ భాగం మేధస్సుని, విచక్షణా జ్ఞానాన్ని మొదలైన వాటిని ఆధీనంలో ఉంచుతుంది. కుడి భాగం సంగీత సామర్థ్యాన్ని కళలయందు ఆసక్తి..." ఇంకా చెప్పబోతున్నాడు జానీ.

వరంథామయ్య అడ్డగించేడు. "నేను మెదడు భాగాల్ని వాటి పనులని అడగటం లేదు. ఆలోచనలెలా ఉద్భవిస్తాయి అని అడిగేను" నీ పని అప్పుడే అవలేదులే అనుకుంటూ.

"పరిశోధకులు ఇంకా 'బ్రెయిన్ రిసెర్చి' చేస్తున్నారండి" - అని నీళ్లు నమిలి తప్పించుకోబోయాడు జానీ.

"నాయనా జానీ! నేనడిగిన చిన్న చిన్న ప్రశ్నలకి ఒకటీ నాకర్థమయ్యేటట్లు జవాబు చెప్పటం లేదు నువ్వు."

"అది సరే! ఇంతకీ మీ పాయింటేమిటి వరంథామయ్య గారూ!" ఎక్కడ తగిలించుకున్నానురా ఈ జలగని అనుకుంటున్నాడు జానీ. అమ్మ మీద చాలా కోపమొచ్చింది ఈ జలగని చూసి రమ్మన్నందుకు.

"నా పాయింట్ తర్వాత చెప్తాగాని - మరొక్క ప్రశ్న!"

"విరాట్ రూపం బొమ్మని ఎప్పుడైనా చూశావా?"

"ఏదో కాలండరు మీద చూశాను."

"ఎలాగుంది ఆ బొమ్మ?"

"దాదాపు ఇండియా మాప్ లాగ ఉంది. ఎన్నో పర్వతాలు, సముద్రాలు, అరణ్యాలు, మనుష్యులు, యుద్ధాలు - ఇంకా ఎన్నో ఉన్నాయి. ఆ బొమ్మలో" తన జ్ఞాపకశక్తిని తానే మెచ్చుకుంటూ చెప్పిన సమాధానం.

"ఆకారం 'ఇండియా మాప్' లాగ ఉందా! మానవ రూపంలో ఉందా?" - వరంథామయ్య ఎన్‌క్వైరీ.



వచ్చే వారం :
డా|| భానుమతీ రామకృష్ణ కథ
'సీత నవ్వింది'

"ఆకారానికి ఇండియాలాగా ఉంది కాని, మానవాకారమే."

"మరి ఇప్పుడైనా ఒప్పుకుంటావా విశ్వమంతా దేవుడని, ఆ దేవుని శరీరంలో మనం చిన్న నలుసుల్లాంటి వారమని?" - ఈ దెబ్బతో దోవలో పడతాడులే అన్న ఉద్దేశంతో వరంధామయ్య వేసిన ప్రశ్న.

"ఈ ఆలోచన నా కెప్పుడూ తట్టలేదండీ! ఏ 'కోర్సు'లోనూ ఇటువంటి సూక్ష్మ రహస్యాలను ఎవరూ నేర్పలేదు, వరంధామయ్యగారూ!" జానీ దాసోహం అన్న ధోరణిలో.

"అందుకనే అన్ని శాస్త్రాలూ అభ్యసించిన తర్వాతనే యోగ శాస్త్రం నేర్చుకోవాలన్నారు కొందరు మేధావులు!" తాపీగా చెప్పారు వరంధామయ్యగారు.

"మరి మన మంతా దైవ శరీరంలో భాగమైతే ఈ యుద్ధాలు, చావులు ఎందుకున్నాయంటారు?" ఈ ప్రశ్నతో ముసలాయన్ని ఇరకాటంలో పెట్టేశాలే అనుకుంటూ జానీ.

"దేవుడు మనల్ని సృష్టించి మనకు విచక్షణా జ్ఞానాన్ని ఇచ్చాడు. ఆ జ్ఞానముపయోగించి మంచీ చెయ్యొచ్చు, చెడూ చెయ్యొచ్చు. కాని మానవుడు తన మేధాశక్తి నంతా చెడుకోసమే ఎక్కువగా ఉపయోగిస్తున్నాడు. మన దేహంలో ఒక్క 'కాన్సర్‌సెల్' చాలు, క్రమేణా తక్కిన భాగాలకి ప్రాకి దేహాన్ని నాశనం చేయడానికి. అలాగే మానవుని కుయుక్తులు అమాయకుల్ని కూడా విపత్తులయంలో ఇరికించి నాశనం చేయగలుగుతున్నాయి. కొన్ని దేశాలలో క్షామం వల్ల ఎంతోమంది మలమల మాడిపోతున్నారు. అలాగే ప్రపంచంలో ఎంతోమంది నిరుద్యోగులున్నారు. ఎన్నో బిలియన్ డాలర్లు వెచ్చించి రోదసిని కూడా జయించాలని తాపత్రయమే కాని, భూగోళం మీద శాంతి నెలకొల్పాలన్న ధ్యాసే లేదు. అదే విధంగా మారణ యంత్రాలను తయారుచేసి మీరు మీరు యుద్ధం చేసుకోండని ఆ యంత్రాలను రహస్యంగా అమ్ముతారు. కాని ఆ డబ్బుని మలమల మాడే ప్రజల ఆరోగ్యానికి ఉపయోగించరు సరికదా, పైగా ఆ దేశం బీద దేశం అని ముద్ర వేస్తారు."

"దానికి స న్నేం చేయమంటారు? నే నేమైనా బాధ్యుడినా?" - జానీ క్వొశ్చన్.

"ఎంతమాట! ని న్నెందుకంటాను? ఎంతో చదువుకున్నవాడివి, పెద్ద ఉద్యోగస్తుడివి! 'గాడ్ అంటే గాడిదగుడ్డు!' అంటున్నావు. మరొక్క చిన్న సందేహం బాబూ! అడగనా?" ఏమీ తెలియనట్లే అమాయకత్వం నటిస్తూ వరంధామయ్య.

"ఓ, తప్పకుండా అడగండి!" [అఁ, వద్దంటే మాత్రం వదిలిపెడతాడా? అనుకుంటూ].

"నీవు ఎన్నో రాకెట్లని, 'స్పేస్ షిప్'లను రోదసిలోకి పంపడంలో సాయం చేస్తున్నావు గదా! నువ్వు ఇష్టం వచ్చినప్పుడు హృదయ స్పందన ఆపుచేయడం, ఇష్టం వచ్చినప్పుడు ప్రారంభించడం చేయగలవా?" పెద్ద లిటిగేషన్‌తో కూడిన ప్రశ్న వేశాడు వరంధామయ్య.

"ఓ, ఎస్! ప్రతి సెకండుకీ చేస్తూనే ఉంటాగా!" జోక్ చేసినట్లుగా తప్పించుకుందామనుకున్నాడు జానీ.

వరంధామయ్య అంతటితో వదిలిపెట్టలేదు.

"నీ శరీరంలో రక్త ప్రవాహాన్ని అదుపులో పెట్టగలవా?"

'ఈ ముసలాయ న్నెందుకు తగిలించుకున్నాను' - అనుకుంటున్నాడు జానీ.

"ఇటువంటి అసందర్భపు ప్రశ్నలేస్తే ఎలాగండీ?"

"అసందర్భం ఏమిటి నాయనా! సందర్భం వచ్చింది కాబట్టే అడుగుతున్నాను!" ఇటువంటి కుర్రకుంకల్నెందర్నో చూశాలే అనుకుంటూ వరంధామయ్య.

"మరో ప్రశ్న!" వీడిని ఒక త్రోవలోకి తీసుకురానిదే వదిలిపెట్టను అనే నిశ్చయంతో.

"అడగండి!" ఈయన అడిగినంతమాత్రాన నేను సమాధానం చెప్పాలని ఎక్కడుంది! ఏదో పెద్దవాడు కదా అని మర్యా దిస్తుంటే, ఆ మర్యాద

కాస్తా నిలువుకోలేకపోతున్నాడు.

"ఎంత ధనవంతుడైనా, ఎంత విజ్ఞాని అయినా చావుని తప్పించుకోగలడా?"

"లేదు." ముభావపు సమాధానం.

"ఎందుచేత?"

"ఇటువంటి ప్రశ్నల కెవడూ సమాధానం చెప్పలేడండీ!" అంటూ విసుగ్గా జానీ లేవబోయాడు.

"అలా అనకు, జానీ! నేను చెప్తాను విను."

"చెప్పండి వింటాను!" విన నన్నా ఎలాగో చెప్తాడు ఈ బోరు మనిషి అనుకుంటూ.

"నాయనా, జానీ! ఈ విశ్వంలో కోట్లాది కోట్ల నక్షత్రాలు, గ్రహాలు ఉన్నా, ఒకదానితో ఒకటి ఢీకొట్టకుండా ఒక పొందికలో ఉంచడానికి, మన శరీర యంత్రం సక్రమంగా పనిచేయడానికి, ప్రతి జీవి చలనానికి, ప్రతి శాస్త్రజ్ఞుడి మేధాశక్తికి కారణం - వీటన్నిటికీ వెనుక రహస్యంగా దాగి ఉన్న ఒక మహత్తర శక్తి.

"ఆ శక్తియే గాడ్! ఆ శక్తి లేకపోతే మనం ఆలోచించలేము. కదల్లేము, బ్రతకలేము. మనం చేసే ప్రతి పనీ మన ప్రజ్ఞ అనుకోవడం అనుకోవడం శుద్ధ పొరపాటు. ఎన్నాళ్ల నుంచో నీలాటి వాళ్లు ఎన్నో పరిశోధనలు చేస్తున్నారు కదా! ఏ ఒక్కడైనా చిన్న పురుగునైనా సృష్టించగలిగాడా?"

జానీకి వరంధామయ్యగారు చెప్పినది కొంత 'రీజనబుల్'గానే అనిపించింది.

పిహెచ్.డి. ఉన్నా నాసాలో కంప్యూటర్ స్పెషలిస్ట్‌గా పనిచేస్తున్నా ముక్కుకి సూటిగా తన పనేదో చేసుకోవటం తప్ప ఇంత చిన్న విషయాలను ఒకనాడూ కూర్చుని ఆలోచించలేదు. ఈ ముసలాయన సాధారణమైన మనిషి కాదు అనుకుంటూ జానీ.

"లేదండీ! ఇంకా పరిశోధనలు జరుగుతున్నాయండీ!" అన్నాడు వినయంగా జానీ.

"అందుకే మనల్ని సృష్టించి ఈ భూమి మీద మనల్ని పావులుగా ఉపయోగించి చదరంగాన్ని తిలకిస్తున్న శక్తియే దేవుడు అంటున్నాము.

"విద్యుచ్ఛక్తి, అయస్కాంత శక్తి, ఆకాశవాణి తరంగాలు, దూరదర్శిని కిరణాలు మొదలైన వాటిని చూడలేనట్లే ఈ విశ్వాన్ని సృష్టించి, సారథ్యం చేస్తున్న దైవశక్తి - కాస్మిక్ పవర్‌ను కూడా చూడలేము. కాని ఆ దైవ శక్తి వల్ల కలిగే ఫలితాలు మాత్రమే చూస్తున్నామంటే ఒప్పుకోడానికి అభ్యంతర మేమిటి? ఇటువంటి చొప్పదంటు ప్రశ్నలు వేసి అనవసరంగా నీ మనసు బాధపెట్టానేమో!" - అమాయకత్వం నటిస్తూ ముగించాడు వరంధామయ్య.

"చొప్పదంటు ప్రశ్నలు కావండీ, వరంధామయ్యగారూ!" ఇంకా ఏదో చెప్పబోతున్నాడు జానీ.

"వరంధామయ్య కాదు, 'రాండీ' అని పిలు!" వరంధామయ్య శాసించాడు.

"అదేమిటండీ!" ఆశ్చర్యంగా ప్రశ్నించాడు జానీ.

"నాలుగక్షరాల జగన్నాథం పేరు పలకడం కష్టమైతే ఐదక్షరాల వరంధామయ్య పేరు నుచ్చరించడం ఇంకా కష్టం కదా! అందువల్ల 'రాండీ' అనే పిలు."

గొంతుకలో వచ్చి వెలక్కాయ పడ్డంత పనయింది జానీకి. అంత ముసలాయన్ని పట్టుకుని 'రాండీ' అని పిలవడ మెలా?

"ఇంతకీ నేను చెప్పే దేమిటంటే మీరు అడిగినవి చొప్పదంటు ప్రశ్నలు కావండీ! [మన లోకంలోకి వస్తున్నాడు జానీ]. ఫారిన్ డిగ్రీలుండీ పెద్ద పదవి నిర్వహిస్తున్నా ఇటువంటి విషయాలను పట్టించుకోకుండా, ఆ పనులన్నీ అనుకోకుండా వాటంతటవి జరిగిపోతాయని అనుకున్నాను. నేనే కాదు, ఈ జీవకోటిలో 99.9 శాతం అలాగే ఊహిస్తుంది."

"ఇప్పుడైనా అర్థమయిందా జానీ, ఈ ముసలాడి ఘోష!"

ఇంతలో ఫలహారం కాఫీ పట్టుకొచ్చింది పర్వతవర్ధని.

పర్వతవర్ధనిని ఉద్దేశించి, "ఇదిగో, పాట్! నువ్వు కూర్చొబోయే ముందు కొంచెం మంచినీళ్లు తీసుకురా!" అన్నాడు వ్యంగ్యంగా వరంధామయ్య.

"పాట్, పావ్ - ఎక్కడి నుంచొచ్చింది ఈ కొత్త పేరు నాకు?" ఆశ్చర్యంగా అడిగింది పర్వతవర్ధని.

ఆరక్షరాల పేరు పలకడం కష్టంగా ఉందే! అందువల్ల ఈ రోజు నుంచీ నీ పేరు 'పాట్', 'నా పేరు 'రాండీ'.

"చూడు, ముచ్చటగా జగన్నాథం 'జానీ', జానకి 'జాకీ' అయిపోయారు. అలాగే మనమూనూ."

"బాగుంది పరాచకం!" మీతోటి వాదం ఎందుకులే అన్నట్లు మంచినీళ్లు తీసుకురావడానికి లోపలి కెళ్లింది పర్వతవర్ధని.

తినమని మంచి భోజనం పెట్టి, గొంతుకను కొడవలితో కోస్తున్నట్లుంది జానీకి. [తనగురించే వెటకారం - వరంధామయ్య పరాచికాలు].

మళ్లీ ప్రారంభించాడు వరంధామయ్య.

"నా చిన్నతనంలో, 'నా అంతటి మేధావి ఎవడూ లేడు; నేను సాధించలేని పనంటూ ఏమీ లేదు' అనుకునేవాడిని. ఎవరైనా దేవుడు పేరు చెప్తే 'గాడ్డా! గాడిద గుడ్డా' అనేవాడిని. మంచి వయసులో ఉన్నప్పుడు అకస్మాత్తుగా పక్షవాతం వచ్చింది. పెద్ద పెద్ద డాక్టర్లు పరీక్షించి ఇది నయం కాదు, జీవితమంతా మంచంలోనో, పడకకుర్చీలోనో ఉండాల్సిందే అని నిశ్చయించారు. అప్పుడు గుర్తొచ్చాడు దేవుడు!"

"అరె! మీకు పక్షవాతం వచ్చిన సూచనలే లేవే! మరి ఎలా నయమయిందండీ!" ఆశ్చర్యపోతూ అడిగాడు జానీ.




మాట్లు వేసే పనే

విలేఖరి : "మీరు సినిమా ఫీల్డుకి రాకముందు ఏం చేశారు?

సంగీత దర్శకుడు : "గిన్నెలకీ, బిందెలకీ మాట్లు వేసేవాడిని"

సిహెచ్.వి.వి.ఎస్.,[కొమరగిరిపట్నం]



"మూడు నెలలు మంచంలో ఉన్నాను. యమ యాతననుకో! మాట సరిగా రాదు. చెంప వంకరపోయింది. కన్ను ఒకటి పైకి పోయింది. ఒక వైపు కాలు, చెయ్యి కదలవు. భగవంతుడా ! దయతలుచు! సాయం చెయ్, భగవాన్! ఈ దీనుడి మీద దయతల్చు! రాత్రింబగళ్లు ప్రార్థించాను. నా ప్రార్థన విన్నాడు భగవంతుడు.

"ఒకరాత్రి కలలో మా తాతయ్య కనబడి, "మీ ఊరు వేణుగోపాలస్వామి గుడిలో ఒక స్వాములారు వచ్చి ఉన్నారు. ఆయన్ని భోజనానికి పిలవండి!" అన్నాడు.

"ఎప్పుడో పోయిన తాతయ్య కలలో కనపడటం అదే మొదటిసారి. ఇదేమి కలో అనుకున్నాను. ఆ మర్నాడే వాకబు చేయగా కలలో విన్నట్లే వేణుగోపాలస్వామి గుడిలో ఒక స్వాములారు వచ్చి ఉన్నారు. హిమవత్పర్వత గుహల్లో ఎంతోకాలం తపస్సు చేశారట! వయస్సు 180 సంవత్సరాలట! కాని కాయకల్ప చికిత్స వల్ల 60 ఏళ్ల మనిషిలాగా కనిపిస్తాడు. ఆయన పేరు కారుణ్యానంద స్వామి.

"పాట్ వెళ్లి ఆయన్ని ఆహ్వానించింది. మా ఆహ్వానం అంగీకరించాడు. నన్ను చూస్తూనే జాలిపడి, 'పూర్వజన్మ సుకృతం బాబూ! ఏం పరవాలేదు. నేను రేపటి నుంచి పక్షం రోజులపాటు హిమాలయాల్లో దొరికే మూలికలతో తయారుచేసిన తైలంతో మర్దన చేస్తాను. మళ్లీ మామూలు మనిషి వవుతావు' అని చికిత్స ప్రారంభించాడు. ఆయన అన్నట్లుగానే పక్షవాతం కాస్తా పరుగెత్తిపోయింది. మహానుభావుడు! ఒక్క కానీ తీసుకోలేదు. నా తృప్తి కోసం కనీసం ఒక వంద రూపాయలైనా తీసుకోమని బతిమాలాను." ఒక్క నిట్టూర్పు వదిలాడు వరంధామయ్య.

"నా కెందుకు బాబూ, డబ్బు! ఎవరికైనా బీదవారి కియ్యి! మేము డబ్బు తీసుకుని చికిత్స చేస్తే అది ఫలించదు. భగవంతుడిచ్చిన ఆ శక్తి కూడా పోతుంది. దేవుడిని నమ్ముకున్నవాడిని. ఏ పూట తిండి దొరకదనుకుంటే ఎవరో నీలాంటి ధర్మాత్ములు పిలిచి భోజనం పెడతారు!" అంటూ వెళ్లిపోయాడు.

"నా ఆవేశం ఉండబట్టక భోరున ఏడుస్తూ ఆయన కాళ్ల మీద పడ్డాను!" ముఖం పక్కకు తిప్పి కళ్ల నీళ్లు తుడుచుకుంటూ ఆపాడు వరంధామయ్య.

"ఆ తర్వాత ఏమయింది?" ఆతృతతో ప్రశ్నించాడు జాని.

"ఆ స్వామి నన్ను లేవదీసి, నేను చేసిం దేమీ లేదు బాబూ! అంతా దేవుడి దయ. బాబూ! నిద్రిస్తున్నా-మెలుకువగా ఉన్నా మనం చేసే ప్రతి క్రియ వెనక నిగూఢమైన ఒక అతీత శక్తి ఉంది. ఆ శక్తే మన హృదయ స్పందనకి, శరీరంలో రక్త ప్రవాహానికి, మన మేధా శక్తికి కారణం. ఆ శక్తే దేవుడు, బాబూ! దైవాన్ని మర్చిపోకు. ఈ విశ్వరంగంలో మనం శుద్ధ కీలు బొమ్మలం మాత్రమే. 'గాడ్జా! గాడిద గుడ్డా!' అనే వాళ్లు లేకపోలేదు. 'గాడ్' దయామయుడు బాబూ! గాడిద గుడ్డు కాదు. 'గాడ్, ది గుడ్'! అని వెళ్లిపోయారు ఆ స్వామివారు."

తన ధోరణి ఆపుచేశాడు వరంధామయ్య.

కళ్లు కాస్తా మామూలు చోటికి వచ్చాయి జానికి. కొమ్ములు కాస్తా కరిగిపోయాయి.

"ఎన్నో విషయాలు తెలుసుకున్నాను మీ దయ వల్ల! మరి వెళ్లివస్తానండీ!" అని సెలవు తీసుకోబోయాడు జాని.

"అలాగే, జానీ! అమెరికా వెళ్లే లోపున మరోసారి వచ్చి చూసిపో! బోరు కొట్టనులే! నిన్ను చూస్తే మా రామ్మూర్తిని చూసినట్లుంది."

"తప్పకుండానండీ! కాని, ఒక్క షరతు!"

"చెప్పాగా! బోరు కొట్టనని!"

"అది కాదు. ఇప్పటి నుంచి నన్ను జగన్నాథం అని పిలుస్తేనే!"

"అలాగే, జగన్నాథం!" చిరునవ్వుతో సాగనంపాడు వరంధామయ్య.

★

